సాక్షి
పల్నాడు
గురువారం । 24 । జూలై । 2025



దుర్గమ్మకు ఆషాఢ సారె
తాడేపల్లి రూరల్ : మంగళగిరి దుర్గానగర్‌లోని కనకదుర్గమ్మ ఆలయంలో బుధవారం యార్డ్ మాజీ వైస్ చైర్మన్ మన్నెం రమేష్, అనిత దంపతులు ఆషాఢ సారెను సమర్పించారు.



వర్మీ కంపోస్టు యార్డు పరిశీలన
తెనాలి టౌన్: స్థానిక బుర్రిపాలెం రోడ్డులోని కంపోస్టు యార్డును బుధవారం మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ ముప్పా యేసుబాబు పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు.



ఘనంగా బోనాల పండుగ
రెంటచింతల: మండలంలోని మిట్టగుడిపాడులో బుధవారం ముత్యాలమ్మకి మహిళలు బోనాలు సమర్పించారు. వానలు కురవాలని ప్రత్యేక పూజలు చేశారు.

న్యూస్‌రీల్

నేడు ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం స్నాతకోత్సవం



గుంటూరు రూరల్: ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం 57వ స్నాతకోత్సవాన్ని కృష్ణా జిల్లా గన్నవరం మండలం ఆత్కూరులోని స్వర్ణభారతి ట్రస్ట్‌లో గురువారం ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్లు ఉప కులపతి డాక్టర్ ఆర్. శారద జయలక్ష్మీదేవి తెలిపారు. బుధవారం నగర శివారుల్లోని లాంఫాం నందున్న విశ్వవిద్యాలయం పరిపాలన భవనంలో ఆమె వివరాలు వెల్లడించారు. విశ్వవిద్యాలయ గౌరవ కులపతి, గవర్నర్ ఎస్. అబ్దుల్‌నజీర్ ముఖ్య అతిథిగా పాల్గొంటారని చెప్పారు. పూర్వ విద్యార్థి, మాజీ స్పెషల్ చీఫ్ సెక్రటరీ, పంజాబ్ గవర్నమెంట్, డైరెక్టర్ పవర్ ట్రేడింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ ఏ. వేణు ప్రసాద్ పాల్గొంటారని ఆమె తెలిపారు. ప్రతిభ చూపిన విద్యార్థులతో పాటు వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచినవారికి స్నాతకోత్సవంలో పురస్కారాలను అందించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయం అధికారులు, శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

త్రికోటేశ్వరునికి రుద్రాభిషేకం



నరసరావుపేట రూరల్: మాస శివరాత్రిని పురస్కరించుకొని కోటప్పకొండలోని శ్రీ మేధా దక్షిణామూర్తి స్వరూప త్రికోటేశ్వర స్వామి వారికి బుధవారం విశేష పూజలు, ప్రత్యేక అలంకరణలు నిర్వహించారు. స్వామి వారికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, లక్ష బిల్వార్చనను ఆలయ అర్చకులు వైభవంగా చేశారు. అభిషేకాలను భక్తులు అధిక సంఖ్యలో తిలకించారు. స్వామి వారిని దర్శించుకున్న భక్తులకు ఆలయ నిర్వాహకులు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

స్వచ్ఛ సర్వేక్షణ్‌లో 'వినుకొండ'కు ర్యాంక్



వినుకొండ: జాతీయస్థాయిలో పురపాలక సంఘాలకు ఇచ్చే స్వచ్ఛ సర్వేక్షణ్ 2024 ర్యాంకింగ్‌లో వినుకొండ పురపాలక సంఘం రాష్ట్ర స్థాయిలో 9వ ర్యాంక్, జాతీయ స్థాయిలో 301వ ర్యాంక్‌ను సాధించింది. ఈ మేరకు మున్సిపల్ కమిషనర్ సుభాష్‌చంద్రబోస్ బుధవారం తెలిపారు. అలాగే ఓడీఎఫ్ ప్లస్ ప్లస్ గుర్తింపు పొందినట్లు ఆయన వివరించారు. ఉత్తమ ర్యాంక్ సాధించడానికి కృషి చేసిన మున్సిపల్ పబ్లిక్ హెల్త్, ఇంజినీరింగ్, ప్లానింగ్ సిబ్బందికి ఆయన అభినందనలు తెలిపారు.

శాకంబరీ దేవిగా దుర్గమ్మ



తాడేపల్లి రూరల్: మంగళగిరి పెదకోనేరులోని శ్రీ దుర్గా భవాని ఆలయంలో ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని బుధవారం శాకంబరీ దేవి అలంకారోత్సవాలు ప్రారంభమ్యాయి. ఆలయ అర్చకులు కూర్మాల బాల సాయి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ కూర్మాల దుర్గా ప్రసాద్ మాట్లాడుతూ మూడు రోజులు పాటు అమ్మవారికి అలంకార ఉత్సవాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. తొలి రోజు అమ్మవారిని కూరగాయలతో శోభాయమానంగా అలంకరించామని చెప్పారు. భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారని ఆయన పేర్కొన్నారు. శ్రావణ మాసం ప్రారంభం రోజు పూలతో అలంకరించి పూజలు నిర్వహిస్తామని ఆయన పేర్కొన్నారు.

కర్షకుడిపై కూటమి కర్కశం

నమ్మించి నట్టేట ముంచడంలో మరోసారి చంద్రబాబు తన నైజాన్ని చాటుకున్నారు. అన్నదాతలకు అండగా నిలుస్తామని ఎన్నికలకు ముందు ఉపన్యాసాలతో ఊదరగొట్టిన ఆయన.. నేడు అధికారంలోకి వచ్చాక ఆ ఊసే ఎత్తడం లేదు. గతేడాది అన్నదాత సుఖీభవ సాయం ఎగ్గొట్టారు. వాతావరణం అనుకూలించక, గిట్టుబాటు ధరలు లేక రైతులు అష్టకష్టాలు పడ్డారు. ఇప్పుడు ఖరీఫ్‌కు చేతిలో చిల్లిగవ్వ కూడా లేక దీనంగా ఎదురుచూడాల్సిన పరిస్థితి వారికి ఎదురవుతోంది. సాగు ఖర్చులకు అధికవడ్డీలకు అప్పులు చేయాల్సి వస్తోంది. మరోవైపు విత్తనాలు, ఎరువులు దొరక్క బ్లాక్ మార్కెట్‌లో అధిక మొత్తం పెట్టి కొనుగోలు చేస్తున్నారు.

- పెట్టుబడి సాయం అందక ఖరీఫ్ సాగుకు కష్టాలు
- జిల్లా వ్యాప్తంగా 2.80 లక్షల మంది రైతులు ఎదురుచూపు
- గతేడాది భారీ నష్టాలతో కుదేలైన అన్నదాతలు
- విత్తనాలు, ఎరువులు, ఇతర ఖర్చులకు అప్పులే దిక్కు
- ఆర్బీకేలలో అందుబాటులో లేని విత్తనాలు, ఎరువులు
- బ్లాక్ మార్కెట్‌లో అధిక ధరలకు కొనాల్సిన దుస్థితి

అన్నదాత సుఖీభవ సాయం అందించని ప్రభుత్వం



సాక్షి, నరసరావుపేట: ఖరీఫ్ సీజన్ ప్రారంభమై ఇప్పటికే ఏడు వారాలైనా సాగు విస్తీర్ణం కనీసం పది శాతం కూడా దాటలేదు. గత నాలుగు రోజులుగా జిల్లాలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. మరోవైపు వారంలో సాగర్ కాలువలకు నీరు రానుంది. ఇప్పుడైనా సాగు పరుగులెడుతుందేమో అనుకుంటే రైతుల వద్ద చిల్లగవ్వలేక అవస్థలు పడుతున్నారు. గతేడాది మిర్చి, పత్తి, పొగాకు మొదలైన పంటలకు చీడపీడలతో దిగుబడి తగ్గడం, పండిన పంటలకు గిట్టుబాటు ధరలేకపోవడం వంటి సమస్యలతో రైతులు కుదేలయ్యారు. ఈ ఏడాది ఖరీఫ్ పంటల సాగుకు అవసరమైన విత్తనాలు, ఎరువులు, దుక్కికి డబ్బులు లేక వ్యవసాయానికి వెనుకాడుతున్నారు.

నాడు ఠంచనుగా సాయం

గతంలో ఏటా ఖరీఫ్ సాగుకు ముందు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వైఎస్సార్ రైతు భరోసా పేరిట ఆర్థిక సహాయం అందజేసేది. ప్రతి రైతుకు ఏడాదికి రూ.13,500 చొప్పున ఐదేళ్లు వారి ఖాతాల్లో నగదు జమ చేసింది. ఇలా పల్నాడు జిల్లాలో మొత్తం ఏకంగా రూ.1,738.58 కోట్ల నిధులను నేరుగా రైతుల ఖాతాలలో వేసింది. తాము అధికారంలోకి వస్తే అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రైతులకు రూ.20 వేలు అందజేస్తామని గత ఎన్నికల్లో కూటమి నేతలు రైతులకు హామీ ఇచ్చారు. ఎన్నికల్లో గెలిచి అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీని మరిచిపోయారు. ఏడాది గడిచినా ఆ ఊసే రాష్ట్ర ప్రభుత్వం ఎత్తడం లేదు. ఖరీఫ్ ప్రారంభమవుతున్న దృష్ట్యా పెట్టుబడి కోసం రైతులు వడ్డీ వ్యాపారుల వైపు చూడాల్సి వస్తోంది.

అధిక వడ్డీలకు అప్పులు తెచ్చి...

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు స్థానికంగా గ్రామంలోనే ఏర్పాటు చేసిన ఆర్బీకే కేంద్రాలలో పంపిణీ చేసేవారు. అయితే కూటమి ప్రభుత్వం ఆర్బీకేలను నిర్వీర్యం చేసింది. ఖరీఫ్ మొదలై దాదాపు రెండు నెలలు కావొస్తున్నా అవేమీ అందుబాటులోకి తీసుకురాలేదు. రైతులు విత్తనాలు, ఎరువుల కోసం ప్రైవేట్ వ్యాపారుల వైపు చూడాల్సి వస్తోంది. ఇదే అదనుగా బ్లాక్ మార్కెట్‌లో వ్యాపారులు విక్రయించి రైతులను దోచుకుంటున్నారు. సాగుకు పెట్టుబడి పెరగడం, ప్రభుత్వం సాయం చేయకపోవడంతో రైతులు అధిక వడ్డీలకు అప్పులు తెచ్చుకుంటున్నారు.

తప్పని ఎదురుచూపు...

పథకం కింద జిల్లాలో ఉన్న 2,80,181 మంది రైతులకు ఏటా రూ.560.36 కోట్లు చెల్లించాల్సి ఉంటుంది. ఇప్పటి వరకు ఆ దిశగా చర్యలు చేపట్టలేదు. గత నెల రోజులుగా జమ చేసే తేదీని వాయిదా వేస్తూ వస్తున్నారు. పీఎం కిసాన్ నిధులను కేంద్రం విడుదల చేసిన రోజు చేస్తామని సాకులు చెబుతున్నారు. ఆలోగా కూటమి ప్రభుత్వం వాటా వేస్తేనే తమకు ఉపయోగపడుతుందని రైతులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే గత ఏడాది సాయం రైతులకు బకాయి పడినట్టైంది.

నియోజకవర్గాల వారీగా సాయం అందాల్సిన రైతుల సంఖ్య...

నియోజకవర్గం	రైతుల సంఖ్య
నరసరావుపేట	25,682
చిలకలూరిపేట	27,594
సత్తెనపల్లి	42,516
పెదకూరపాడు	47,255
గురజాల	42,202
మాచర్ల	46,422
వినుకొండ	48,510
మొత్తం	2,80,181



రెండో ఏడాది వచ్చినా పైసా ఇవ్వలేదు



ఎన్నికల సమయంలో చంద్రబాబు ఏటా ప్రతి రైతుకు రూ.20 వేలు పెట్టుబడి సాయం అందిస్తామన్నారు. అధికారంలోకి వచ్చి రెండో ఖరీఫ్ సీజన్ పూర్తి కావొస్తున్నా ఒక్క పైసా ఇవ్వలేదు. గతేడాది పంటలకు గిట్టుబాటు ధర లేక తీవ్రంగా నష్టపోయాం. ప్రస్తుతం పెట్టుబడికి చేతిలో చిల్లిగవ్వ లేక అప్పులు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.

– ఇగుటూరి కోటిరెడ్డి, రైతు, దొండపాడు, నరసరావుపేట మండలం

రైతులను మోసగించిన చంద్రబాబు



ఎన్నికల్లో అడ్డగోలు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఇప్పుడు బీద పలుకులు పలుకుతోంది. అన్ని వర్గాలను మోసం చేస్తోంది. అన్నదాత సుఖీభవ పథకాన్ని అమలు చేయకుండా రైతులను ముంచేసింది. జగన్ ప్రభుత్వంలో ఐదేళ్లు రైతు భరోసా డబ్బులు ఖాతాల్లో ఎప్పటికప్పుడు జమ చేశారు.

– అన్నెం పున్నారెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు

రాష్ట్ర ప్రభుత్వమే రూ.20 వేలు ఇవ్వాలి



కూటమి ప్రభుత్వ ఎన్నికల హామీ మేరకు అన్నదాత సుఖీభవ పథకానికి సంబంధించి రైతులకు రూ.20 వేలు కేంద్ర ప్రభుత్వంతో సంబంధం లేకుండా వెంటనే ఇవ్వాలి. ఇప్పటికే రెండు నెలలు ఆలస్యమైంది. గతేడాది ఇవ్వాల్సిన సహాయాన్ని ప్రభుత్వం ఎగ్గొట్టింది. ఇకనైనా చిత్తశుద్ధిని నిరూపించుకోవాలి. కేంద్రాన్ని సాకు చూపి వాయిదాలు వేయడం మానుకోవాలి.

– ఏపూరి గోపాలరావు, ఏపీ రైతు సంఘ జిల్లా కార్యదర్శి

ఓటు... ఇక కూత వేటు

- ప్రతి 1,200 మంది ఓటర్లకు ఒక పోలింగ్ కేంద్రం
- జిల్లాలో 189 పోలింగ్ కేంద్రాల్లో 1,200 మందికిపైగా ఓటర్లు
- జిల్లా వ్యాప్తంగా మొత్తం 1,932 పోలింగ్ కేంద్రాలు
- మార్పులకు కసరత్తు చేపట్టిన జిల్లా యంత్రాంగం



సత్తెనపల్లిలోని 52వ పోలింగ్ కేంద్రం

సత్తెనపల్లి: జిల్లాలో ఓటర్లకు సమీపంలో పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు ఎన్నికల సంఘం చర్యలు చేపడుతుంది. ఓటు హక్కు వినియోగించుకునేందుకు వచ్చే ఓటర్లకు పోలింగ్ కేంద్రాలు సౌకర్యవంతంగా ఉండేలా చేయనుంది. ఈ మేరకు కలెక్టరేట్ అధికారులు కసరత్తు చేస్తున్నారు. జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ప్రస్తుతం 1,500 మందికి ఒక పోలింగ్ కేంద్రం ఉంది. ఓటు హక్కు వినియోగించుకునేందుకు మహిళలు, వృద్ధులు, దివ్యాంగులు ఎక్కువ సేపు క్యూ లైన్‌లో వేచి ఉండి ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. అలా కాకుండా ప్రతి 1,200 మంది ఓటర్లకు ఒక పోలింగ్ కేంద్రం దగ్గరగా ఉండేలా ఏర్పాటు చేయాలని ఎన్నికల సంఘం ఇటీవల మార్గదర్శకాలు జారీ చేసింది.

జిల్లాలో 1,932 పోలింగ్ కేంద్రాలు...

జిల్లా వ్యాప్తంగా ప్రస్తుతం 1,932 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. ఇందులో 189 పోలింగ్ కేంద్రాల్లో 1,200 మందికి పైగా ఓటర్లు ఉన్నట్లు కలెక్టరేట్ అధికారులు గుర్తించారు. పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటతో పాటు చిలకలూరిపేట, వినుకొండ నియోజకవర్గాల్లో 1,200 మంది పైబడి ఓటర్లు ఉన్న పోలింగ్ కేంద్రాలు ఎక్కువగా ఉన్నాయి. పెదకూరపాడు నియోజకవర్గంలో తక్కువగా ఉన్నాయి. పోలింగ్ కేంద్రాల మార్పులపై కసరత్తు నిర్వహిస్తున్నారు. ఇప్పటికే జిల్లా స్థాయిలో కలెక్టర్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించి కొత్త పోలింగ్ కేంద్రాల ప్రతిపాదనలు తీసుకున్నారు. కొత్త పోలింగ్ కేంద్రాల ఏర్పాటుపై కసరత్తు పూర్తి చేసి ముసాయిదా జాబితా తయారు చేయనున్నారు. ఎన్నికల సంఘం ఆమోదం వచ్చిన తర్వాత కొత్త పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు అయ్యే అవకాశం ఉంది.

అభ్యంతరాలు పరిశీలించాక..

ఈ నెలాఖరు లోపు జిల్లాలోని అన్ని నియోజకవర్గాల సహాయ ఎన్నికల అధికారులు (ఆర్‌ఓ) నుంచి ప్రతిపాదనలు తీసుకొని వాటిపై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల నుంచి అభ్యంతరాలు స్వీకరించనున్నారు. ఈ ప్రక్రియ పూర్తయితే ఇక పై కూత వేటు దూరం లోనే ఓటర్లకు సౌకర్యవంతమైన పోలింగ్ కేంద్రం అందుబాటులోకి రానుంది.

సమస్యలనేకం.. సంఘాలు శూన్యం

- జాడ లేని ఆహార సలహా సంఘాలు
- చౌక దుకాణాలపై కొరవడిన పర్యవేక్షణ
- నిత్యావసర సరుకుల పంపిణీలో మోసం
- పౌరసరఫరాల శాఖ అధికారుల నిర్లక్ష్యం



సత్తెనపల్లి తహసీల్దార్ కార్యాలయం

జిల్లాలో పరిస్థితిదీ..

రెవెన్యూ డివిజన్	చౌకదుకాణాలు	రేషన్‌కార్డులు
నరసరావుపేట	526	2,56,399
సత్తెనపల్లి	354	1,79,379
గురజాల	409	1,99,115
మొత్తం	1,289	6,34,893

సత్తెనపల్లి: జిల్లాలోని చౌక దుకాణాల్లో నిత్యావసర సరుకుల అక్రమాలకు చెక్ పెట్టి కార్డుదారులకు సక్రమంగా అందేలా చూడాల్సిన బాధ్యత ఆహార సలహా సంఘాలపై ఉంది. మూడు నెలలకు ఒకసారి సంఘం ఆధ్వర్యంలో సమీక్షించాలి. అందుకు అనుగుణంగా చర్యలు తీసుకోవాల్సి ఉంది. జిల్లాలో సంఘాల విషయంలో ఆ ఊసే లేదు.
జిల్లా వ్యాప్తంగా 1,289 చౌక దుకాణాలు ఉండగా.. 6,34,893 రేషన్ కార్డులు ఉన్నాయి. వీటిలో 18,09,128 మంది సభ్యులుగా ఉన్నారు. చౌక దుకాణాల్లో అక్రమాలను అరికట్టేందుకు ప్రభుత్వం ఆహార సలహా సంఘాలను ఏర్పాటు చేస్తుంటుంది. ఈ సంఘం దుకాణాల తనిఖీలు, బియ్యం సరఫరాపై నిఘా, తూనికలు–కొలతలపై పర్యవేక్షణ అధికారాలు కలిగి ఉంటుంది. సంబంధిత అధికారులు ఈ సంఘం ఏర్పాటు చేసి, సమావేశాలు నిర్వహించాలి. ఆ దాఖలాలు లేకపోవడంతో చౌక దుకాణ డీలర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. సరుకుల నాణ్యతను పట్టించుకునేవారు కరువయ్యారు. లబ్ధిదారులు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం ఉండటం లేదు. చౌక దుకాణాల్లో సకాలంలో సరుకులు పంపిణీ చేయటం లేదని, కొలతల్లో తేడాలు ఉంటున్నాయని, ఆన్‌లైన్ సక్రమంగా పని చేయటంలేదని లబ్ధిదారులు గగ్గోలు పెడుతున్నారు.

సంఘం ఏర్పాటు ఇలా ...

ఆహార సలహా సంఘానికి జిల్లా స్థాయిలో చైర్మన్‌గా కలెక్టర్, జాయింట్ కలెక్టర్, మండల స్థాయిలో వైస్ చైర్మన్‌గా ఎంపీపీ, కన్వీనర్‌గా తహసీల్దార్ వ్యవహరిస్తారు. సభ్యులుగా ఎంపీడీవో, జెడ్పీటీసీ సభ్యులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, డీలర్ల సంఘం అధ్యక్షుడు, హాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు, పాత్రికేయులు, ఉపాధ్యాయులు ఉంటారు. ప్రతి మూడు నెలలకోసారి సమావేశమై పరిస్థితిని సమీక్షించేవారు. నేడు సంఘం లేకపోవడంతో అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు.

గత ప్రభుత్వంలో...

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో లబ్ధిదారులకు ఎండీయూ ఆపరేటర్ల ద్వారా, వలంటీర్లు ఇంటింటికి వెళ్లి నిత్యావసర సరుకులు అందించేవారు. కూటమి ప్రభుత్వం వచ్చాక పూర్తిగా ఈ వ్యవస్థ గాడి తప్పింది. జిల్లాలో పేదలకు సరుకులు సరఫరా చేసే 402 ఎండీయూ వాహనాలను నిలిపివేసింది. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దివ్యాంగులు, వృద్ధులు చౌక దుకాణాలకు వెళ్లి క్యూలో అవస్థలు పడి సరుకులు తీసుకోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బియ్యం ఇవ్వలేదు



మాది పట్టణంలోని 25వ వార్డు. నేను ఈ నెల 10వ తేదీన చౌక దుకాణానికి సరుకుల కోసం వెళితే లేవన్నారు. బియ్యం ఇవ్వాలి కదా అని ప్రశ్నించగా ... పోర్టబులిటీ కనుక ఎవరు ఎక్కడైనా తీసుకోవచ్చని, ఎక్కువ మంది నా వద్ద తీసుకో వడంతో అయిపోయాయని సమాధానం ఇచ్చారు. కార్డులో ముగ్గురం ఉన్నాం. మా అమ్మ తోట వెంకటరత్నం కార్డులో ఐదుగురు సభ్యులు ఉన్నారు. మొత్తం 40 కేజీలు బియ్యం రావాల్సింది. కానీ ఇవ్వలేదు.

– గంజినబోయిన లీలావతి, సత్తెనపల్లి

లోపించిన పర్యవేక్షణ



గతంలో ఆహార సలహా సంఘాలు ఏర్పాటు చేసి సమావేశాలు నిర్వహించేవారు. సరుకుల పంపిణీ పై పర్యవేక్షణ ఉండేది. లోటుపాట్లపై సమావేశాల్లో అధికారులు దృష్టికి సంఘం సభ్యులు తీసుకొచ్చేవారు. సంఘాల నియామకంపై ఈ నెల 14న జాయింట్ కలెక్టర్‌ను కలిశాం. సర్క్యులర్ పంపుతామన్నారు. ఏ సరుకులు పంపిణీ చేస్తున్నారు, వాటి నాణ్యత, కార్డులు తొలగింపు వంటి వాటిపై సంఘం ప్రశ్నించే వీలుంది.

– జి. విజయ్ కుమార్, సీపీఎం జిల్లా కార్యదర్శి, పల్నాడు

టెండర్ బెదిరింపులు

- మేమే వేస్తాం..మిగిలిన వారు వేయొద్దు !
- వాట్సాప్ గ్రూపుల్లో మేసేజ్‌లు పెడుతున్న పచ్చ కాంట్రాక్టర్లు
- ఎవరైనా వేస్తే నగరపాలక సంస్థ కార్యాలయానికి పిలిపించి బెదిరింపులు

సాక్షి ప్రతినిధి, గుంటూరు: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పచ్చ నేతల ఆగడాలకు అడ్డూ అదుపులేకుండా ఉంది. గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో చేపట్టే ప్రతి పని తమకే కావాలని పట్టుబడుతున్నారు. తమ సామాజిక వర్గానికి చెందిన వారే టెండర్లల్లో పాల్గొంటారని, ఎవరైనా కాదని పాల్గొంటే వారిని బెదిరించడం పరిపాటిగా మారింది. మాట వినని వారిని నగరపాలక సంస్థ కార్యాలయానికి పిలిచి మేయర్ దగ్గర లేదా ఇంజినీరింగ్ అధికారుల దగ్గర పంచాయితీ పెట్టి బెదిరిస్తున్నారు. బిల్లులు ప్రాసెస్ కాకుండా చేస్తామని చెబుతుండటంతో కాంట్రాక్టర్లు చేసేదేమి లేక పాలకులు, అధికారులు చెప్పినట్లుగా టెండర్ల నుంచి తప్పుకుంటున్నారు.

బహిరంగంగా బెదిరింపులు

గుంటూరు నగర పరిధిలోని ఏఈ 12 పరిధిలో ఆగతవరప్పాడు సాయిబాబా టెంపుల్ వద్ద రూ.36,81,666లక్షలతో, ఏఈ 15 పరిధిలో ప్రగతీ నగర్ వద్ద రూ.19,73,550 లక్షలతో వర్కులకు పార్టీ అబ్లిగేషన్ కింద టీడీపీ నాయకులు టెండర్ వేయాలనుకుంటున్నారు. మిగిలిన వారు బిడ్‌లో పాల్గొనకూడదంటూ టీడీపీకి చెందిన ఓ పచ్చ కాంట్రాక్టర్ వాట్సాప్ గ్రూప్‌లో మెసేజ్ పెట్టాడు. ఎవరైనా టెండర్‌లో పాల్గొంటే బిల్లులు ప్రాసెస్ కానివ్వమంటూ పేర్కొన్నాడు. తమపై పచ్చ కాంట్రాక్టర్లు బహిరంగంగా బెదిరింపులకు దిగుతున్నట్లు తోటి కాంట్రాక్టర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వర్కుల్లో నాణ్యత లోపం

గుంటూరు నగరంలో గత నెలలో 269 వర్కులకు టెండర్లు పిలిచారు. వీటిల్లో మెజార్టీ వాటిని టీడీపీకి చెందిన పచ్చ కాంట్రాక్టర్లే దక్కించుకున్నారు. సకాలంలో వర్కులు మొదలు పెడతారా ? అంటే అది లేదు. వర్క్ ప్రారంభించినా మెటీరియల్‌లో నాణ్యతకు పాతర వేస్తున్నారు. అధికారులు కూడా చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నట్లు సమాచారం. ఇందుకు నిదర్శనం మంగళవారం గుంటూరు నగరం దేవాపురం 4వ లైనులో పీకలవాగుపై తూతూమంత్రంగా నిర్మిస్తున్న కల్వర్టు అద్దం పడుతుంది. అది ఒక్కసారి కుప్పకూలి అక్కడ పనిచేస్తున్న ఓ కార్మికుడు మృతి చెందాడు. అధికారులు పచ్చ కాంట్రాక్టర్లకు ఏ విధంగా సపోర్ట్ చేస్తున్నారో ఈ సంఘటన చూస్తే స్పష్టంగా అర్థం అవుతుంది. ప్రమాదవశాత్తు ఎవరైనా చనిపోతే కార్మిక చట్టాల ప్రకారం రూ. 12 లక్షలను కాంట్రాక్టర్ చెల్లించాలి. అధికారులు, మేయర్ చర్చల పేరుతో కార్మికుడి కుటుంబానికి రూ.5 లక్షలు మాత్రమే ఇచ్చి చేతులు దులుపుకున్నారు.

భ్రమరాంబకు విశేష అలంకరణలు

స్థానిక శివాలయంలో శ్రావణమాసం పురస్కరించుకుని మొదటి శుక్రవారం భ్రమరాంబ అమ్మవారిని పలు పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించనున్నట్లు ఆలయ ఉప కమిషనర్ గోగినేని లీలాకుమార్ తెలిపారు. శ్రావణ మాసమంతా శుక్రవారాల్లో అమ్మవారు పసుపు కొమ్ములు, గాజుల అలంకరణ, చీరల అలంకరణలో దర్శనమిస్తారని ఆయన పేర్కొన్నారు. భక్తులంతా శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామిని దర్శించుకొని కృపాకటాక్షాలకు పాత్రులు కావాలని ఆయన కోరారు. భక్తులందరికీ స్వామివారి తీర్థ, ప్రసాదాల పంపిణీకి ఏర్పాట్లు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

–పెదకాకాని



క్లుప్తంగా

శైవక్షేత్ర రాష్ట్ర అధ్యక్షుడిగా జూలకంటి



పిడుగురాళ్ల: శ్రీ శైవక్షేత్ర ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నూతన అధ్యక్షుడిగా జూలకంటి శ్రీనివాసరావును ఎన్నుకున్నట్లు శ్రీనివాసరావు మంగళవారం తెలిపారు. శ్రీ శైవ క్షేత్ర ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవం మంగళవారం సాయంత్రం విజయవాడలోని తాళ్లయపాలెంలోని శ్రీ శైవ క్షేత దేవాలయ ప్రాంగణంలోని ధర్మో రక్షిత రక్షిత సమావేశ మందిరంలో జరిగింది. క్షేత్ర పీఠాధిపతులు శ్రీశ్రీ శివస్వామి రాష్ట్ర అధ్యక్షుడిగా జూలకంటి శ్రీనివాసరావును ప్రమాణ స్వీకారం చేయించినట్లు శ్రీనివాసరావు తెలిపారు. దీంతో శ్రీనివాసరావును పిడుగురాళ్ల పట్టణ ప్రముఖులు అభినందించారు.

జాతీయ స్విమ్మింగ్ పోటీలకు ముగ్గురి ఎంపిక



నరసరావుపేట ఈస్ట్: జాతీయస్థాయి స్విమ్మింగ్ పోటీలకు పల్నాడుజిల్లా నుంచి ముగ్గురు క్రీడాకారులు ఎంపికైనట్టు పల్నాడుజిల్లా స్విమ్మింగ్ అసోసియేషన్ కార్యదర్శి వై.వి.సుబ్బారెడ్డి బుధవారం తెలిపారు. విశాఖలో ఈ నెల 19, 20 తేదీలలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి వాటర్ పోలో ఎంపిక పోటీలో ఆర్.హర్షవర్ధన్‌రాజు, వై.మధుకిషోర్, కె.శివసాకెత్ ప్రతిభ చూపి రాష్ట్ర జట్టుకు ఎంపికయ్యారని వివరించారు. బెంగుళూరులో ఆగస్ట్ 4 నుంచి 8వతేదీ వరకు జరగనున్న 51వ జూనియర్ నేషనల్ చాంపియన్‌షిప్ పోటీలో వాటర్ పోలో క్రీడలో పాల్గొనే ఆంధ్రప్రదేశ్ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. అలాగే విశాఖలో నిర్వహించిన పోటీల్లో అండర్–17 బాలికల విభాగంలో జీఎస్ఎస్ నిత్య 50 మీటర్ల ఫ్రీ స్టైల్ విభాగంలో కాంస్య పతకం సాధించినట్టు తెలిపారు. క్రీడాకారులను కోచ్ జి.సురేష్, సుబ్బారెడ్డి అభినందించారు.

వరుణా.. ఎంత పనిచేశావ్!

- ఉప్పవాగు, కొండవాగులు ఉధృతం
- యడ్లపాడు మండలంలో వరద ముంపులో పంట పొలాలు



జాలాది వద్ద పంటపొలాలపై విరుచుకుపడ్డ వరదనీరు



వంకాయలపాడు వద్ద పొలాల్లో వాననీరు నిలిచిన దృశ్యం

యడ్లపాడు: సీజన్ ఆరంభానికి ముందే కురిసి, తీరా అదును సమయానికి ముఖం చాటేసిన వరుణుడు, ఇప్పుడు కుండపోత వర్షాలతో రైతుల ఆశలను అడియాశలు చేశాడు. శుక్ర, ఆది, సోమవారాల్లో 76.2 మీమీ వర్షపాతం కురవడంతో రెండు పంటలు సాగు చేయాలన్న మండల రైతులకు రెండో పంట సంగతి ఏమోగాని, ప్రతీ రైతు రెండసార్లు విత్తనాలు నాటుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. మండలంలో ఉప్పవాగు, కొండవాగులు ఉధృతమై ప్రవహించాయి. ఎప్పుడు నీటి జాడ కనిపించని నక్కవాగు, లింగారావు పాలెంలోని పడమర వాగులు సైతం నిండుగా పారాయి. వాగులు, వంకలు, కుంటలు నిండిపోయాయి. కుండపోత వర్షానికి తోడు ఎగువ ప్రాంతాల్లో కురిసిన వాననీరు వరదగా మారి మండలంలోని దిగువ ప్రాంతాలపైకి విరుచుకుపడింది. ఇప్పటికే పత్తి విత్తనాలు విత్తుకున్న రైతులకు ఈ వరదలు తీవ్ర నష్టాన్ని మిగిల్చాయి. ఆయా గ్రామాల్లోని పంట పొలాల్లో అక్కడక్కడా గండ్లు పడటంతో పరిస్థితి మరింత దయనీయంగా మారింది. మరోవైపు సోమవారం రాత్రి లింగారావుపాలెంలో పడమర వాగు పొంగడంతో, వరద నీరు ఊరిని చుట్టుముడుతుందని గ్రామస్తులు తీవ్ర ఆందోళనతో రాత్రంతా జాగారం చేశారు.

విత్తనాలు బొగిలి, మొలకలు కుళ్లి..

ముందస్తుగా యడ్లపాడు, లింగారావుపాలెం, సొలస, చెంఘీజ్‌ఖాన్ పేట, తిమ్మాపురం పత్తి విత్తనాలు వేసుకున్న పత్తి రైతులు వర్షాభావ పరిస్థితులు కారణంగా భూమిలో నాటుకున్న విత్తనాలు బొగిలిపోవడంతో రెండోసారి విత్తుకున్నారు. వీరికి ప్రస్తుతం కురిసిన కలిసి వచ్చినా రెండు సార్లు అచ్చుతోలి నాటుకున్న అధిక ఖర్చుల భారం మీద పడింది. ఇక కారుచోల, గుత్తావారి పాలెం, జగ్గాపురం, జాలాది గ్రామాల్లో వాగు, కుంటలు, బోర్ల కింద కొందరు పత్తి విత్తనాలు నాటారు. ఇవి మొలకలు వచ్చాయి.

అయితే శుక్రవారం నుంచి దశల వారీగా దంచికొట్టిన వానకు అవికూడా కుళ్లిపోవడంతో వీరు రెండో పర్యా యం విత్తుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇటీవల వర్షం వచ్చే సూచన్లు ఉన్నాయని తెలిసీ పత్తి విత్తనాలు నాటిన వారి పరిస్థితి అధిక వర్షంతో తేమశాతం ఎక్కువై నేలలోనే నాటిన గింజలు కుళ్లి పోతాయని తాము తప్పక తిరిగి మరోమారు విత్తుకోవాల్సిందేనని అలా నాటుకున్న రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇక జాలాది పరిసర పొలాల్లో వర్షాలకు 15 రోజులకు ముందుగా ఎదబెట్టి జ్యూట్ విత్తనాలను సుమారు 50 ఎకరాలకు పైగా విత్తుకున్నారు. సోమవారం రాత్రి ఎగువ ప్రాంతాల నుంచి ఉధృతంగా ప్రవహించిన వరద నీరు కారణంగా జ్యూట్ విత్తనాలు కుళ్లిపోతాయని రైతులు చెబుతున్నారు. వీరు రెండోసారి విత్తనాలు ఎదబెట్టక తప్పదని పెదవిరుస్తున్నారు. ఇలా వర్షాభావంతో, వర్షం కురుస్తుందని కొందరు, వర్షం అధికమై మరికొందరు విత్తన దశలోనే చిత్తయిపోయారు. ఖరీఫ్ సీజన్‌లో రెండు పైర్లు సాగు చేయాలన్న ఆలోచన అటుంచి, రెండుసార్లు విత్తనాలు నాటుకోవాల్సిన పరిస్థితి మాత్రం రైతులకు తప్పడం లేదు.

వరద నీరు ప్రవాహమై ముంచెత్తిందిలా...

ఎగువ ప్రాంతాల నుంచి తిమ్మాపురం, దింతెనపాడు మీదుగా వచ్చిన పొలాల్లోని వరద నీరు కొల్లుగుంట నిండి గణేశునివారిపాలెం, సందెపూడి, తుర్లపాడు వైపుగా ప్రవహిస్తూ చివరకు కుప్పగంజి వాగులో కలుస్తుంది. దీంతో ఆయా ప్రాంతాల్లో వర్షాలకు ముందుగానే విత్తుకున్న పత్తి, జ్యూట్ విత్తనాలు కుళ్లిపోయాయి. అలాగే ఉన్నవ పొలాల్లోని వరద నీరంతా కారుచోల చెరువులోకి వచ్చి ఆ చెరువు అలుగు మీదుగా పారి యడ్లపాడు, జగ్గాపురం పొలాల పరిధిలోని బొల్లయ కాలువ మీదుగా జాలాది పంట పొలాల్లోకి చేరి అక్కడి నుంచి నక్కవాగులో కలుస్తుంది. ఆయా గ్రామాల్లో పొడివిత్తనాలు వేసుకున్న రైతుల పొలాల మీదుగా అత్యధిక వరదనీరు ప్రవహించడంతో మొలకెత్తిన, కొత్తగా విత్తుకున్న పత్తి విత్తనాలన్నీ కుళ్లిపోతాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

డివైడర్‌ను ఢీకొన్న ట్రావెల్స్ బస్సు



బస్సు ఢీకొనడంతో ధ్వంసమైన డివైడర్

నరసరావుపేటటౌన్: ప్రయాణికులతో వస్తున్న ప్రైవేటు ట్రావెల్స్ బస్సు అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టిన సంఘటన బుధవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. నిత్యం రద్దీగా ఉండే గడియార స్తంభం సెంటర్‌లో ఆ సమయంలో ఎవ్వరూ లేకపోవటంతో పెను ప్రమాదం తప్పినట్లు అయింది. పోలీసుల కథనం ప్రకారం.. షిర్డీలో మారుతి సుధాశ్రీ ట్రావెల్స్ బస్సు ప్రయాణికులను ఎక్కించుకొని గుంటూరుకు బయలు దేరింది. మార్గమధ్యంలో తెల్లవారు జామున నరసరావుపేట గడియార స్తంభం వద్దకు వచ్చే సరికి ఆగి ఉన్న లారీని తప్పించే క్రమంలో అదుపుతప్పి బస్సు డివైడర్‌ను ఢీకొంది. సంఘటనలో బస్సు ముందు భాగం పాక్షికంగా దెబ్బతింది. సంఘటనతో ట్రాఫిక్ నిలిచి పోయింది. సమాచారం అందుకున్న సీఐ లోకనాథం సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకొని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

పిడుగురాళ్లలో హతమార్చి నంద్యాలలో డోర్ డెలివరీ!

- మృతదేహాన్ని కారులో తీసుకువచ్చి భర్త ఇంటి వద్ద విడిచిపెట్టిన భార్య
- హత్యకు సహకరించిన తమ్ముడు



మృతుడు రమణయ్య

నంద్యాల: భర్తను తన తమ్ముడితో కలిసి చంపేసి.. ఆపై మృతదేహాన్ని కారులో తీసుకువచ్చి నంద్యాలలోని భర్త ఇంటి వద్ద విడిచిపెట్టింది. ఈ ఘటన నంద్యాలలో జరిగింది. నంద్యాల టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాలు.. నంద్యాలలోని నూనెపల్లెకు చెందిన రమణయ్య (50)కు పల్నాడు జిల్లా పిడుగురాళ్లకు చెందిన రమణమ్మతో 20 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి జ్యోతి, చందన, సాయి సంతానం. దంపతుల మధ్య మనస్పర్థల కారణంగా భార్య కొంతకాలంగా పుట్టిల్లు అయిన పిడుగురాళ్లలో ఉంటోంది. ఈ క్రమంలో భార్యతో మాట్లాడి ఇంటికి తీసుకొని రావడానికి భర్త పిడుగురాళ్లకు సోమవారం రాత్రి వెళ్లాడు. అక్కడ భార్య బంధువులు, రమణయ్య మధ్య ఘర్షణ జరిగింది. ఈ క్రమంలో రమణమ్మ, ఆమె తమ్ముడు రామయ్య కలిసి, రమణయ్య కంట్లో కారం చల్లి దాడి చేయడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. అనంతరం తమ్ముడితో కలిసి భర్త మృతదేహాన్ని కారులో నంద్యాలలోని ఆయన ఇంటి వద్దకు తీసుకు వచ్చి, మృతదేహాన్ని అక్కడ పడేసి పరారయ్యారు. మృతుడి ముఖంపై కారంపొడి ఉండటం..తల, వీపుపై గాయాలు ఉండటంతో రమణయ్య కుమార్తెలు జ్యోతి, చందన నంద్యాల పోలీసులకు ఫిర్యాదు చేశారు. టూటౌన్ పోలీసులు నంద్యాల ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. పిడుగురాళ్ల పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

రైలు కిందపడి యువతి బలవన్మరణం

సత్తెనపల్లి: రైలు పట్టాలపై యువతి బలవన్మరణానికి పాల్పడిన సంఘటన సత్తెనపల్లి మండలం కంకణాలపల్లి రైల్వే గేట్ సమీపంలో మంగళవారం రాత్రి జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. బెల్లంకొండ మండలం గంగిరెడ్డిపాలెం గ్రామానికి చెందిన భార్యాభర్తలు గత కొన్ని నెలలుగా వెన్నాదేవిలో అద్దె ఇంటిలో నివాసం ఉంటున్నారు. భార్య సోదరి వెన్నదేవిలోని వారి ఇంటికి వచ్చింది. కుటుంబ కలహాల నేపథ్యంలో మంగళవారం రాత్రి విజయవాడ నుంచి లింగంపల్లి వెళ్లే రైలు వస్తుండగా 20 ఏళ్ల యువతి పట్టాలపై నిల్చుని బలవన్మరణానికి పాల్పడింది. యువతి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ప్రభుత్వ ఏరియా వైద్యశాలకు తరలించి కేసు నమోదు చేసుకుని రైల్వే పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో కౌలు రైతు మృతి



రెంటచింతల: మండలంలోని మిట్టగుడిపాడు గ్రామంలో బుధవారం సాయంత్రం ఓ కౌలు రైతు విద్యుదా ఘాతంతో కౌలు మృతి చెందినట్లు బంధువులు పేర్కొన్నారు. మిట్టగుడిపాడు గ్రామానికి చెందిన బి.నరసింహారావు (38) గత పదేళ్ల క్రితం రామిరెడ్డి పొలం కౌలుకు తీసుకొని అప్పటి నుంచి ఏటా సేద్యం చేస్తున్నట్లు తెలిపారు. ట్రాన్స్‌ఫార్మర్ దగ్గరలో కరెంట్ మీటర్ దగ్గర బోర్డు పనిచేస్తున్నారని, విద్యుత్ తీగ తగిలి అక్కడికక్కడే మృతిచెందినట్లు చెప్పారు. ఆయనకు భార్య నాగలీల ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రేపు జాబ్‌మేళా

గుంటూరు ఎడ్యుకేషన్: దిశ డాన్ బాస్కో సేవా విభాగ ఆధ్వర్యంలో ఈనెల 25న విద్యానగర్‌లోని డాన్‌బాస్కో ఐటీఐ కళాశాలలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ పి.జీవన్, ప్రిన్సిపాల్ రాజశేఖర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వరుణ్ మోటార్స్, చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు, ఫ్యూచర్ ప్రాపర్టీ, ఇన్నో సోర్స్, కేప్‌స్టన్, మెడ్‌ప్లస్, అపోలో ఫార్మసీ, పేటీఎం, శ్రీరామ్ ఫైనాన్స్, హీరో మోటోకార్ప్, ఫోర్డ్ మేనేజ్‌మెంట్ తదితర కంపెనీలు పాల్గొంటున్నట్లు పేర్కొన్నారు. జాబ్ మేళాను నిరుద్యోగ యువతీ, యువకులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. టెన్త్, ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ, ఫార్మసీ, బీటెక్ విద్యార్హతలు కలిగిన అభ్యర్థులు ప్రవేశ రుసుం చెల్లించాల్సిన అవసరం లేకుండా నేరుగా హాజరు కావచ్చునని ఆయన సూచించారు. ఇతర వివరాలకు 79811 72216, 82972 42547, 80730 31426 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

12 మండలాల్లో మోస్తరు వర్షం

కొరిటిపాడు(గుంటూరు): జిల్లాలో 12 మండలాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షం పడింది. మంగళవారం ఉదయం నుంచి బుధవారం ఉదయం వరకు అత్యధికంగా తుళ్లూరు మండలంలో 42.4 మిల్లీ మీటర్లు పడగా, అత్యల్పంగా ఫిరంగిపురం మండలంలో 1.6 మి.మీ. కురిసింది. సగటున 9.4 మి.మీ. వర్షపాతం నమోదైంది. వివిధ మండలాల్లో నమోదైన వర్షపాతం వివరాలు ఇలా ఉన్నాయి.. తాడికొండ మండలంలో 31.4 మి.మీ., పెదకాకాని 30.4, దుగ్గిరాల 16.8, మంగళగిరి 16.2, తాడేపల్లి 9.6, కొల్లిపర 7.2, మేడికొండూరు 5.6, గుంటూరు పశ్చిమ 3.2, గుంటూరు తూర్పు 2.6, తెనాలి మండలంలో 2.2 మి.మీ. చొప్పున వర్షం పడింది. జూలై 23వ తేదీ వరకు జిల్లాలో సాధారణ వర్షపాతం 122.4 మి.మీ. పడాల్సి ఉండగా, ఇప్పటి వరకు 197.8 మి.మీ. నమోదైంది.

వర్షానికి కోతకు గురైన కల్వర్టు

గరికపాడు– పమిడిపాడు గ్రామాల మధ్య నిలిచిన రాకపోకలు



వర్షానికి తెగిపోయిన రోడ్డు

బొల్లాపల్లి: రెండు రోజులు క్రితం కురిసిన భారీ వర్షానికి మండలంలోని గరికపాడు -పమిడిపాడు గ్రామాల మధ్య రహదారిలో ఉన్న కల్వర్టు కోతకు గురైంది. దీంతో రెండువైపులా రాకపోకలు నిలిచాయి. భారీ వర్షానికి మండలంలోని నాగులేరు ఉధృతంగా ప్రవహించడంతో ఎన్నో ఏళ్ల క్రితం నిర్మించిన చప్టా అనుకుని రోడ్డు కోతకు గురైంది. దీంతో ఈ ప్రాంతంలో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. వినుకొండ-కారంపూడి రహదారి పరిధిలో బొల్లాపల్లి మండలం నుంచి రేమిడిచర్ల గుమ్మంపాడు గరికపాడు పమిడిపాడు గ్రామాలను కలుపుతూ ఈ రహదారి కారంపూడి వెళ్తుంది. గత రెండు రోజులుగా రాకపోకలు నిలిచిపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని వాహన చోదకులు వాపోతున్నారు. బొల్లాపల్లి నుంచి కారంపూడికి చిరు వ్యాపారులు ఉద్యోగులు విద్యార్థులు రైతులు రాకపోకలు సాగిస్తుంటారు. రెండు రోజులుగా నాగులేరు ప్రవాహానికి కల్వర్టు తెగిపోవడంతో రాకపోకలు స్తంభించాయి. గతంలో అదేవిధంగా వర్షాలకు కల్వర్టు మరమ్మతులకు గురైందని, అప్పట్లో తూతు మంత్రంగా మరమ్మతులు చేపట్టంతో ఈ దుస్థితి నెలకొందని పలువురు వాపోతున్నారు. సంబంధిత శాఖ అధికారులు కోతకు గురైన కల్వర్టును మరమ్మతులు చేపట్టి రాకపోకలు పునరుద్ధరించాలని వాహన చోదకులు కోరుతున్నారు.

రెంటపాళ్లలో వైఎస్సార్ సీపీ శ్రేణులపై దాడి



చికిత్స పొందుతున్న క్షతగాత్రుడితో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

సత్తెనపల్లి: మిరప నారు దిబ్బల పైకి గొర్రెల మందను వదలడమే కాకుండా వైఎస్సార్ సీపీ శ్రేణులపై సత్తెనపల్లి మండలం రెంటపాళ్ల గ్రామంలో టీడీపీ సానుభూతిపరులు మంగళవారం రాత్రి దాడికి పాల్పడ్డారు. వివరాలు ఇలా ఉన్నాయి. పల్నాడు జిల్లా రెంటపాళ్ల గ్రామానికి చెందిన వల్లెపు రాంబాబు, వల్లెపు రవితేజ, వల్లెపు వీరయ్య మిరప నారు దిబ్బలు సాగు చేస్తుండగా టీడీపీ సానుభూతి పరులైన నంబుల కాటంరాజు, యాగంటి బాబురావు, సైదయ్యలకు చెందిన గొర్రెల మంద పడటంతో వారి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. దీంతో కోపోద్రిక్తులైన కాటంరాజు, బాబురావు, సైదయ్యలు దాడి చేయడంతో వల్లెపు రాంబాబు, వల్లెపు రవితేజ, వల్లెపు వీరయ్యలకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించారు. కాగా వైఎస్సార్ సీపీ శ్రేణులు సత్తెనపల్లి రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, ప్రతిగా టీడీపీ సానుభూతిపరులు కూడా ఫిర్యాదు చేశారు. గాయపడి ఏరియా వైద్యశాలలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను వైఎస్సార్ సీపీ నాయకులు కొర్లకుంట వెంకటేశ్వర్లు, కొమ్మెర శివశంకర్, కొమెర వీరాంజి, మారిశెట్టి వెంకట్రావు, వల్లెపు సహదేవుడు, గంగిలి ఏసోబు, చల్లా వెంకటేశ్వర్లు, తదితరులు పరామర్శించారు.

అందుబాటులో 1,681 మెట్రిక్ టన్నుల ఎరువులు



మాట్లాడుతున్న ఏడీఏ రవిబాబు, పక్కన ఏఓ సుబ్బారెడ్డి

సత్తెనపల్లి: ఖరీఫ్ సాగుకు సత్తెనపల్లి పట్టణ, గ్రామీణ పరిధిలోని ఎరువుల దుకాణాల్లో 1,681 మెట్రిక్ టన్నుల ఎరువులు అందుబాటులో ఉన్నాయని సత్తెనపల్లి సహాయ వ్యవసాయ సంచాలకులు బి.రవిబాబు అన్నారు. పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డ్ ప్రాంగణంలో గల గుంటూరు జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ లిమిటెడ్‌ను బుధవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రవిబాబు మాట్లాడుతూ సత్తెనపల్లి పట్టణ, గ్రామీణ పరిధిలోని ఎరువుల దుకాణాల్లో యూరియా–590 మెట్రిక్ టన్నులు, డీఏపీ– 327 మెట్రిక్ టన్నులు, పొటాష్ ఎరువులు –95 మెట్రిక్ టన్నులు, కాంప్లెక్సు ఎరువులు–585 మెట్రిక్ టన్నులు, ఎస్ఎస్‌పీ–84 మెట్రిక్ టన్నులు నిల్వలు ప్రభుత్వం ద్వారా అందుబాటులో ఉంచామన్నారు. రైతులందరూ మీ మీ గ్రామాల పరిధిలో ఉన్నటువంటి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల వద్ద, ప్రైవేట్ ఎరువుల దుకాణాలు వద్ద నుంచి ఎరువులను పొందవచ్చన్నారు. కార్యక్రమంలో సత్తెనపల్లి మండల వ్యవసాయ అధికారి బి.సుబ్బారెడ్డి, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

హత్యాయత్నం కేసులో నిందితుడికి జైలు

రేపల్లె: ఓ వ్యక్తిని కత్తితో హత్య చేయడానికి ప్రయత్నించిన కేసులో నిందితుడికి ఆరు సంవత్సరాల జైలు శిక్ష, రూ.25 వేల జరిమానా విధిస్తూ రేపల్లె సీనియర్ సివిల్ జడ్జి ఎస్‌పీడీ వెన్నెల బుధవారం తీర్పు వెలవరించారు. పట్టణానికి చెందిన ఆర్‌కే జ్యూయలర్స్ నిర్వాహకుడు జక్కం రామకృష్ణ భార్యపై పట్టణానికి చెందిన పడకల వెంకటేశ్వరరావు 2017 సెప్టెంబర్ 11న అసభ్యకరంగా ప్రవర్తించాడని ఆరోపణలు వచ్చాయి. దీనిపై జక్కం రామకృష్ణ నిలదీశారు. వెంకటేశ్వరరావు చాకుతో రామకృష్ణపై దాడి చేసి హత్య చేసేందుకు ప్రయత్నించాడు. బాధితుడి ఫిర్యాదుతో రేపల్లె ఎస్ఐ బాలనాగిరెడ్డి కేసు నమోదు చేశారన్నారు. దర్యాప్తులో నేరం రుజువు కావటంతో న్యాయమూర్తి తీర్పునిచ్చారు. కేసును పబ్లిక్ ప్రాసిక్యూటర్ అనగాని శ్రీనివాసమూర్తి వాదించారు.

రైలు ప్రమాదంలో వ్యక్తి మృతి

చీరాల రూరల్: రైలు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన చినగంజాం–ఉప్పుగుండూరు రైల్వేస్టేషన్ల మధ్య దిగువలైన్‌లో చోటుచేసుకున్నట్లు జీఆర్పీ ఎస్సై సీహెచ్ కొమడయ్య బుధవారం తెలిపారు. మృతుని వయస్సు 30 సంవత్సరాలు ఉంటాయని, 5.5 అడుగుల ఎత్తు, ఛామనఛాయ రంగు కలిగి ఉన్నాడని తెలిపారు. మృతుని కుడి రిబ్స్‌పై ఒక నల్లని పుట్టుమచ్చ, ఎడమ భుజంపై ఒక నల్లని పుట్టుమచ్చ ఉందన్నారు. మృతుని శరీరంపై నలుపు రంగు గడులు కలిగిన ఫుల్‌హ్యాండ్ షర్ట్, వెలిసిపోయిన బ్లూ జీన్స్ ప్యాంట్ ఉందని, ఎడమచేయి ఉంగరం వేలుకు తాబేలు బొమ్మ ఉన్నట్లు చెప్పారు. మృత దేహాన్ని పరిశీలించగా ఎటువంటి ఆధారాలు లభించలేదన్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని చీరాల ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుని ఆచూకీ తెలిసినవారు 9440627646 నంబర్‌కు సమాచారం అందించాలని సూచించారు.

నోటీసులు ఇచ్చిన గంటకే సస్పెండ్ చేశారు

పెదకూరపాడు : కూటమి ప్రభుత్వం అధికారులను అడ్డుపెట్టుకొని తనపై, తన కుటుంబ సభ్యులపై కక్ష సాధింపులకు పాల్పడుతుందని లింగంగుంట్ల గ్రామానికి చెందిన 18వ నంబరు రేషన్ షాప్ నిర్వాహకురాలు యెండ్లూరి ఉదయలక్ష్మి ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం లింగంగుంట్ల గ్రామంలో తన నివాసంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తనిఖీలు చేసిన గంటకు నోటీసులు ఇచ్చి తమ షా పులో ఉన్న రేషన్ స్టాకును వేరే షాప్ కు తరలించారన్నారు. ఇంట్లో మేం లేని సమయంలో రెవెన్యూ అధికారులు, పోలీసులు వచ్చి దురుసుగా ప్రవర్తించారని ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయ స్వలాభం కోసం తనపై, తన కుటుంబం పై దుష్ప్రచారం చేసి బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారన్నారు.

సివిల్ సప్లయి డెప్యూటీ తహసీల్దార్ వివరణ...

కాగా, ఈ విషయమై సివిల్ సప్లయి డెప్యూటీ తహసీల్దార్ చీమలను వివరణ కోరగా ఈనెల 9న మండలంలోని లింగంగుంట్ల గ్రామంలో శ్రీ విఘ్నేశ్వర స్వయం సహాయక సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 18వ రేషన్ షాపును తనిఖీ చేయగా నిల్వల కన్నా అధికంగా 125 కేజీలు బియ్యం, ఐదు కేజీలు పంచదార ప్యాకెట్లు ఉన్నట్లు గుర్తించామని, దీనిపై 6–ఏ నమోదు చేసి ఆర్డీవోకు రిపోర్ట్ చేశామని తెలిపారు. ఈనెల 21వ తేదీన ఆర్డీవో షాపును సస్పెండ్ చేస్తున్నట్లు నోటీసులు ఇచ్చామన్నారు. మిగిలిన స్టాకును స్వాధీనం చేసుకునేందుకు వెళ్ళగా రేషన్ షాపు నిర్వాహకులు సహకరించకపోవడంతో పెదకూరపాడు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఆమె పేర్కొన్నారు.

28న నిధి ఆప్‌కే నికట్

గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరులోని ఉద్యోగుల భవిష్యనిధి సంస్థ (ఈపీఎఫ్) ప్రాంతీయ కార్యాలయ ఆధ్వర్యంలో ఈనెల 28న నిధి ఆప్‌కే నికట్ కార్యక్రమాన్ని ఆరు జిల్లాల్లో నిర్వహిస్తున్నట్లు ప్రాంతీయ పీఎఫ్ కమిషనర్ ఎస్.తానయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గుంటూ రు, కృష్ణా, ఎన్టీఆర్, పల్నాడు, బాపట్ల, ప్రకాశం జిల్లాల్లో ఉదయం 9.30 గంటల నుంచి జరగను న్న సమావేశాల్లో యజమానులు, ఉద్యోగులు, పెన్షనర్లతో పాటు ఇతర వాటాదారులు, లబ్ధిదారులతో పరస్పరం ముఖాముఖీగా చర్చలు జరుగుతాయని పేర్కొన్నారు. గుంటూరు జిల్లా దుగ్గిరాలోని సీసీఎల్ లిమిటెడ్, కృష్ణా జిల్లా పెదఅవుటపల్లిలోని హైటెక్ ప్రింట్ సిస్టమ్స్ లిమిటెడ్, ఒంగోలులోని ఈఎస్ఐసీ బ్రాంచ్ కార్యాలయం, విజ యవాడలోని ఈఎస్ఐసీ బ్రాంచ్ కార్యాలయం, నరసరావుపేటలోని కృష్ణవేణి డిగ్రీ కళాశాల, బాపట్ల జిల్లా నందిరాజుతోటలోని ప్రకాష్‌నగర్ గ్రామసిరిలో నిధి ఆప్‌కే నికట్ సమావేశాలు జరుగుతాయని తెలిపారు. పీఎఫ్ భాగస్వామ్య యజమానులంతా పాల్గొని ఫిర్యాదులు, సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలని ఆయన సూచించారు.

పరిహారం చెల్లించిన తరువాతే పనులు చేపట్టాలి

శంకర్ విలాస్ ఆర్వోబీ నిర్మాణ బాధితుల డిమాండ్

గుంటూరు ఎడ్యుకేషన్: శంకర్ విలాస్ రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణంతో భవనాలు కోల్పోతున్న యజమానులకు హైకోర్టు ఆదేశాల మేరకు 2013 భూసేకరణ చట్ట ప్రకారం నష్ట పరిహారాన్ని చెల్లించిన తరువాతే పనులు ప్రారంభించాలని బ్రాడీపేట-అరండల్‌పేట షాప్ ఓనర్స్ అండ్ కీపర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు బెల్లంకొండ శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. శంకర్ విలాస్ సెంటర్‌లో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. భూసేకరణ ప్రక్రియ పూర్తయిన తర్వాతే బ్రిడ్జి పనులు చేపట్టాలని హైకోర్టు స్పష్టమైన తీర్పు ఇచ్చినప్పటికీ, అధికార యంత్రాంగం పెడచెవిన పెట్టిందని ఆరోపించారు. ఆర్వోబీ నిర్మాణంతో భవనాలు కోల్పోతున్న 58 మంది యజమానులకు నష్టపరిహారాన్ని ఇవ్వాల్సి ఉందని చెప్పారు. ఈ విధంగా దాదాపు రూ.50 కోట్ల నుంచి రూ.60 కోట్ల మేరకు చెల్లించాల్సిన నష్టపరిహారంతో పాటు ఆర్వోబీ నిర్మాణ వ్యయం రూ.98 కోట్లను కలుపుకుంటే మెగా ఫ్లైఓవర్ నిర్మించవచ్చునని తెలిపారు. ఈ విషయాలన్నింటినీ పక్కనపెట్టిన ప్రభుత్వం, అధికార యంత్రాంగం హడావుడిగా పిల్లర్స్ నిర్మాణ పనులను చేపట్టారని చెప్పారు. ప్రభుత్వం ఇచ్చిన వర్క్ ఆర్డర్‌లోనే బ్రిడ్జ్ నిర్మాణానికి ముందుగానే రోడ్డు విస్తరణ పనులు, కాలువల నిర్మాణం, విద్యుత్ స్తంభాల షిఫ్టింగ్ పూర్తి చేయాల్సి ఉందని, అధికారులు ఇవేవీ చేయలేదని విమర్శించారు. అధికారులు ఏకపక్ష వైఖరితో ముందుకు వెళితే కోర్టు ధిక్కరణ కిందకు వస్తుందని స్పష్టం చేశారు. అందరికీ ఆమోదయోగ్యంగా ఉండే డిజైన్ ప్రకారం హిందూ కళాశాల కూడలి నుంచి లాడ్జి సెంటర్ వరకు మెగా ఫ్లైఓవర్‌ను, సింగిల్ పిల్లర్‌తో పాటు ఆర్‌యూబీలను ఏర్పాటు చేయడం ద్వారా వాహనాలు సులభంగా ప్రయాణిస్తాయని తెలిపారు. 70 ఏళ్లుగా అభివృద్ధి చెందిన శంకర్ విలాస్ సెంటర్ ఉనికి దెబ్బతినకుండా ఉంటుందని చెప్పారు. ఎర్త్ వాల్‌తో కూడిన ప్రస్తుత డిజైన్ ద్వారా బ్రిడ్జిని నిర్మించడం ద్వారా ఈ ప్రాంతం పూర్తిగా నిర్వీర్యం అవుతుందని అభిప్రాయపడ్డారు. అసోసియేషన్ నాయకుడు జి.కార్తిక్ మాట్లాడుతూ తాము బ్రిడ్జి నిర్మాణానికి, అభివృద్ధికి వ్యతిరేకం కాదని తెలిపారు. పరిహారం కింద బాండ్లు ఇస్తే తీసుకోబోమని, 2013 భూసేకరణ చట్ట ప్రకారం పరిహారం ఇవ్వాలని కోర్టుకు వెళ్లగా తమకు అనుకూలంగా తీర్పు వచ్చిందన్నారు. కోర్టు తీర్పును అమలు చేయాలని ఆయన కోరారు.